# నీరు, ప్రగతి, ప్రపంచ శాంతి

ప్రపంచ జల దినోత్సవం

22 మార్చ్ 2024

జలమే జీవం. నీరే ప్రాణాధారం.ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది. ప్రతి నీటి చుక్క ఎంతో శక్తివంతమైనది. నీరుంటేనే అభివృద్ధి, నాగరికత, పర్యావరణ సమతుల్యత, శాంతి, సౌభాగ్యం. నీరులేనిదే ఆహార భద్రత లేదు. ఆరోగ్యం, పారిశుధ్ధ్యం, సంక్షేమం, సమసమాజం, సాంస్కృతిక, ధార్మిక, రంగాలన్నింటిలో నీటిదే ప్రధాన పాత్ర. ప్రపంచాభివృద్ధిలో నీటి యొక్క పాత్ర గణనీయం. నీరు సహజ మానవహక్కు, పారిశుధ్ధ్యంతో కలిపి అన్ని అవసరాలకు అందరికీ సరిపడా నీటి వసతి ఆరోగ్యకరమైన, సుస్థిర, శాంతియుత, సంపన్న సమాజానికి ఎంతో అవసరం. అందరికీ నీటి హక్కు కల్పించకుండా అభివృద్ధి పథంలో ముందుకు సాగలేం. పేదరికం, అసమానతలు, ప్రకృతి విపత్తులు, మానవహక్కుల సంక్షోభం మరియు పెరుగుతున్న నిర్వాసితులు వంటి అనేక సమస్యలు ముప్పిరిగొంటున్న నేటి ప్రపంచంలో ఎవరినీ విస్మరించకుండా అందరికీ నీటి సదుపాయం కలగచేయడం అవసరం.

మన నిత్య జీవితంలో, ప్రపంచ అభివృద్ధిలో మంచినీటి ప్రాముఖ్యతను గుర్తిస్తూ, 1993 నుండి ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ క్షీణిస్తున్ననీటి వనరులు పరిస్థితిని గుర్తించి మానవాళి అభివృద్ధికి, పర్యావరణ సమతుల్యతకు మరియు నీటికి గల అవినాభావ సంబంధాన్ని ప్రాముఖ్యతను ప్రపంచమంతా చాటి చెప్పేందుకు ఈ రోజు అనేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. నీటికి సంబంధించి ప్రతిఏటా ఒక అంశంతో ఈ రోజును జరుపుకుంటారు. నీటి యొక్క ప్రాముఖ్యత, నీటి వనరుల స్థితిగతుల పై అవగాహన పెంచడానికి మరియు జల సంరక్షణకు ప్రజానీకాన్ని సమాయత్తం చేయడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడ్డమది. ప్రపంచ నీటి దినోత్సవం, 2030 నాటికి అందరికీ నీరు మరియు పారిశుద్ధ్యానికి లక్ష్యంగా చేసుకుని సుస్థిరాభివృద్ధి 6 వ లక్షం సాధనకు దోహదపడుతుంది. . ప్రతి సంవత్సరం, ఐక్యరాజ్యసమితి ఈ రోజు కోసం ఒక థీమ్‌ను నిర్దేశిస్తుంది, 2024 యొక్క దృష్టి "నీరు మరియు ప్రపంచ శాంతి".

నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రక్షిత నీటి లభ్యతకు నోచుకోకుండా ఉన్నారు.ఐక్యరాజ్యసమితి తాజా అంచనాల ప్రకారం 2.2 బిలియన్ల ప్రజానీకం స్వచ్ఛమైన మరియు సురక్షితమైన నీటికి నోచుకోవడం లేదని తెలుపుతున్నది. నీటి కాలుష్యం, మితి మీరిన నీటివనరుల వినియోగం నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్ళు. విశేషమేమిటంటే, నీరు కేవలం జీవనోపాధిని కల్పించడమే కాదు, సంఘర్షణలు రేకెత్తించ గలదు మరియు శాంతిని నెలకొల్పగలదు. నీటి కోసం నిత్యం జరిగే పోరాటాలు మనం చూస్తూనే ఉన్నాం.

నీరు మన ఆరోగ్యానికి ఏంటో ముఖ్యం. ఆహారం లేకున్నా కొన్ని వారాలు బతకగలం కానీ నీరు లేకుండా కొద్ది  రోజులు కూడా జీవించలేము. మన శరీరంలో 60% వరకు నీరు ఉంటుంది. శిశువులలో 78% వరకు ఉంటుంది. ప్రతి మనిషికి తాగడానికి, వంటకు,శరీర శుభ్రతకు నీరు అవసరం. పారిశుధ్యం, ఆరోగ్యం కావాలంటే నీరు అవసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి మనిషికి 7.5 లీటర్ల తగు నీరు అవసరం అని నిర్ధారించింది. ఇతర అవసరాలు కలుపుకొని ప్రతి మనిషికి కనీసం రోజుకు 20 లీటర్ల నీరు అవసరము.

అభివృద్ధిలో  ఎంతో ముందుకు వెళ్తున్నా ఇంకా ప్రపంచ జనాభాలో 748 మిలియన్  ప్రజలకు సరియైన  తాగు నీటి సౌకర్యం లేదు. అలాగే  కోట్ల  మంది పారిశుధ్య వసతుల లేమితో బాధపడుతున్నారు. నీరు, పారిశుధ్య రంగాలలో వసతుల కల్పన  ద్వారా  అనేక ఆర్థిక, సామజిక ప్రయోజనాలు ఒనగూరతాయి.  ప్రజారోగ్యం, జీవనోపాధులు, నాణ్యమైన జీవనం వంటి లక్షాల సాధనకు నీరు ఎంతో అవసరం.

ప్రస్తుత ప్రపంచంలో ప్రతివారం 10 లక్ష మంది నగరాలకు తరలుతూ ఉన్నారని ఒక అంచనా. నేటి జనాభాలో ప్రతి ఇద్దరి లో ఒకరు నగరంలో నివసిస్తున్నారు.  93% నగరీకరణ పేద మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగుతున్నది. అలాగే నగరాలలో 40 % మంది మురికి వాడలలో నివసిస్తున్నారు. 2050 నాటికి మరొక 250 కోట్ల మంది నగరాలకు చేరుతారని ఒక అంచనా. నగరీకరణ ఎక్కువగా భారతదేశం, చైనా, నైజీరియా వంటి దేశాలలో జరుగుతున్నది అని నివేదికలు సూచిస్తున్నాయి.

నగరాల నిర్వహణ, అక్కడి ప్రజలకు వసతుల కల్పన అనేది ప్రపంచ దేశాలన్నింటికీ  21 వ దశాబ్దపు  అతి పెద్ద సవాలుగా పరిణమించింది. మంచి నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ కోసం వేల కోట్లు  ఖర్చు  చేస్తూ వేలాది మైళ్ళ పైపు లైన్లు వేస్తూ కోట్ల కొలది ఖర్చుతో  నిర్వహణ చేయవలసి వస్తున్నది.  చాలా నగరాలలో మురుగు నీటి నిర్వహణ వ్యవస్థ  అనేదే లేదు. నీటి సరఫరా, నిర్వహణ నగరాల అభివృద్ధిని ప్రభావితం చేస్తాయి.

ఒక ఈత కొలను నింపడానికయ్యే నీటి కన్నా ఒక కారు నిర్మించాడనికి ఎక్కువ నీరు అవసరం. ప్రపంచంలో ప్రతి వస్తువు ఉత్పత్తికి నీరు అవసరం. కొన్ని పరిశ్రమలకు అధికంగా నీరు అవసరం. ఒక కాగితం తయారీకి 10 లీటర్ల నీరు కావాలి. 500 గ్రాముల ప్లాస్టిక్ తయారీకి 91 లీటర్ల నీరు కావాలి. పారిశ్రామిక ఉత్పత్తికి, ఉపాధి, ఆదాయ కల్పనకు నీరు దోహదపడుతుంది. అయితే చాలావరకు పరిశ్రమలు ఉత్పత్తిని పెంచడం పైనే దృష్టి పెడుతున్నాయి కానీ, నీటిని సమర్ధవంతంగా, వాడుకునే విషయం పై నీటి పొదుపు పై గాని ఆలోచించడం లేదు. పరిశ్రమలకు నీటి అవసరం 2000 నుంచి 2050 సంవత్సరాల మధ్య 400% రెట్లుగా పెరుగుతుందని అంచనా. ఇది ఏ ఇతర రంగానికన్నా ఎక్కువే. ఈ పెరుగుదల ఎదుగుతూ ఉన్న ఆర్థిక వ్యవస్థలలో మరియు అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాలలో ఎక్కువగా ఉండబోతోంది. అనేక పెద్ద సంస్థలుసమర్ధవంతమయిన నీటి వినియోగంలో ముందడుగు వేస్తున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా నీటి వనరుల పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సాంకేతికత జోడించి, తెలివిగా నడుచుకుంటే పారిశ్రామిక నీటి యాజమాన్యంలో ఏంతో పురోగతి సాధించవచ్చును. తద్వారా నీటిని పొదుపుగా వాడుకుని, నీటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణంపై, నీటి వనరులపై పారిశ్రామిక ప్రభావాన్ని తగ్గించ వచ్చును.

నీటికి శక్తి వనరులకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. విద్యుత్ ఉత్పత్తికి నీరు ఒక ముఖ్య వనరు. అలాగే నీటి సరఫరాకు విద్యుతు అవసరం. ప్రస్తుతం 80% విద్యుత్తు బొగ్గు ఆధారిత థర్మల్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అవుతున్నది. జల విద్యత్తు కేంద్రాలలో అలాగే థర్మల్ కేంద్రాలలో నీరు అత్యంత అవసరం. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుతులో 16% జల విద్యత్తు గా ఉన్నది. నిర్మాణంలో ఉన్న, నిర్మిచాబదబోతున్న వేలాది ఆనకట్టల ద్వార ఉత్పత్తి అయ్యే విద్యుత్తు రెటింపు కాబోతున్నది. విద్యుతు ఉత్పత్తి రంగంలో నీటిని సమర్ధవంతంగా వాడుకోవాల్సిన అవసరం ఉన్నది. సముద్రపు అలలు, మురుగు నీరు ద్వార విద్యత్తు ఉత్పత్తిని పెంచుకోవాలి. అలాగే పునరుత్పాదక ఇంధన వనరులైన పవన, సౌర, సముద్ర తరంగ, వర్షపాతం ఇలా అనేక ఇతర అవకాశాలను శోదించి, వృద్ధి చేస్తే మంచి నీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుంది.

ప్రతి రోజు ఒక అమెరికన్ పౌరుడు రమారమి 7500 లీటర్ల నీటిని వాడతాడు. అదీ ముఖ్యంగా ఆహారం కోసం. ఒక కాలరీ ఆహారం తయారీకి ఒక లీటరు నీరు అవసరం. నీటి పారుదల వ్యవస్థ పటిష్టంగా లేకపోతే అదే ఒక కాలరీ ఉత్పత్తికి 100 లీటర్ల నీరు అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 90% నీరు వ్యవసాయం కోసమే వినియోగించబడుతూ ఉన్నది. ప్రపంచ నీటి వనరులలో 70% వ్యవసాయ రంగం కోసం వాడబడ్తున్నాయి. వ్యవసాయం ద్వార పెరుగున్న జనాభా అవసరాలకు తగినంతగా ఆహారం పండించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలకు ఈ అవసరం రెట్టింపుగా వున్నది. ఆర్థిక వృద్ధి, వ్యక్తిగత సంపద పెరుగుదల మూలంగా ప్రపంచ ఆహార వినియోగంలో మార్పు వచ్చింది. ప్రధానంగా పిండి పదార్థాలనందించే దాన్యాహారం నుండి మాంసం ఉత్పత్తుల వినియోగం పెరుగుతూ వస్తున్నది. 1 కిలో బియ్యం ఉత్పత్తికి 3500 లీటర్ల నీరు అవసరం అయితే 1 కిలో మాంసం 15000 ఉత్పత్తికి లీటర్ల నీరు కావాలి. ఆహార వినియోగంలో చోటు చేసుకుంటున్న ఈ మార్పు ప్రపంచ నీటి వనరుల వినియోగంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆహారోత్పత్తికి నీటి వినియోగం మూలంగా భూగర్భ జలాలు, నదీ ప్రవాహాల పై ప్రతికూల ప్రభావాలు చూపుతున్నాయి. అలాగే వన్యప్రాణి అవాసాలు కూడా ప్రభావితం అవుతున్నాయి. దాదాపు 20% సాగు భూములు చౌడు నెలలుగా మారాయి. ఆహారోత్పత్తి విషయంలో నీటి వినియోగం సమర్థవంతంగా ఉండేలా కృషి సాగాలి.

నివాసప్రాంతాలు, విద్యాలయాలు, కర్మాగారాలు, కార్యాలయాలు, పరిశ్రమలు, పంటపొలాలు అన్నీ కూడా నీటికి సంబంధించిన సమస్యలు ఎదురుకుంటున్నాయి మరియు ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, కాందిశీకులు, నిరుపేదలు, ఆదివాసీలు, వికలాంగులు వంటి వర్గాలు నీటి హక్కుపట్ల వివక్షకు గురవుతున్నారు, విస్మరించబడుతున్నారు. ప్రతి రోజు ప్రపంచ మహిళ నీటి సేకరణకు కోట్లాది గంటలు శ్రమిస్తున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో గృహ నిర్వహణ అంతా మహిళలు బాలికల వల్లనే జరుగుతూ ఉన్నది. ఈ దేశాలలో సగటు మహిళ ఒక రోజు దాదాపు 25% శాతం సమయం కుటుంబం కోసం నీటి సేకరణపై శ్రమిస్తున్నవి అని అంచనా వేయబడింది. ఫలితంగా ఆ సమయంలో ఆదాయాలని కోల్పోవటం, కుటుంబాన్ని పట్టించుకోవడం, బాలికలు పాఠశాలలకు వెళ్ళలేక పోవడం వంటి సమస్యలు అనేకం. నీరు, పారిశుధ్యం పై వెచ్చించే ప్రతి పైసా ఎన్నో రెట్ల ప్రయోజనాలు అందజేస్తుంది. ఈ రంగంలో ఒక డాలర్ ఖర్చు చేస్తే వచ్చే సామాజిక ఆర్థిక ప్రయోజనం 5 నుంచి 28 డాలరుల గా అంచనా వేయబడింది.

అరణ్యాలు,  చిత్తడి నేలలు, గడ్డి మైదానాలు వంటి జీవావరణ వ్యవస్థలు ప్రపంచ జల చక్రంలో అతి ముఖ్య అంశాలు. జీవావరణ వ్యవస్థలు సహజ స్థిరంగా ఆరోగ్యకరంగా ఉంటేనే స్వచమైన  నీరు ప్రకృతి లో లభ్యమవుతుంది. మనం నిర్మించుకున్న  ఆధునిక ఆర్థిక వ్యవస్థలు ఈ సహజసిద్ధ జీవావరణ వవస్తల  అంతర్గత విలువను విస్మరించాయి, లేదా తక్కువగా అంచనా వేశాయి. అందుకే మనం వీటిపట్ల అత్యంత నిర్లక్షంగా,  ప్రాస్వ దృష్టితో  వ్యవహరిస్తున్నాం. తద్వారా అస్థిర నీటి యాజమాన్యం, ప్రకృతి వనరుల నాశనం జరుగుతూ వస్తున్నది. కొన్ని అమెజాన్, కాంగో నదుల మారుమూల ఉప నదులు, సుదూర పరివాహక ప్రాంతాలు  మాత్రమే ప్రపంచంలో ఇంకా కలుషితానికి, విధ్వంసానికి ఇంకా గురికాని జలావరణ వ్యవస్థలు. ఇవి కూడా మానవుని అభివృద్ధికి  ప్రకోపానికి, గురయ్యే ప్రమాదం అంచున ఉన్నాయి. నివాస ప్రాంతాలనుండి, పరిశ్రమల నుండి వచ్చె మరుగు నీరు , వ్యవసాయ  ప్రాంతాల మీదుగా వచ్చే నీరు ద్వార  సహజ ప్రాకృతిక వ్యవస్థలు  మరింత క్షీణించే ప్రమాదం ఉన్నది. నీటి విషయంలో ఇతర జీవ జాతుల అవసరాలు మనం ఎప్పుడూ పట్టించుకోము. జీవావరణ వ్యవస్థల  విలువను గుర్తించే ఆర్థిక వ్యవస్థ  దిశగా మనం అడుగులు వేయాలి. ప్రకృతి అందించే సేవలు  మనం నీటి వనరుల అభివృద్ధిపై వెచ్చించే దానికన్నా అనేక రెట్లు  ఎక్కువగా  ఉంటాయని అంచనా వేయబడినది.  ఈ జల-జీవావరణ కేంద్రంగా  సాగే అభివృద్ధి యాజమాన్య విధానాలు నీటి వనరుల సుస్థిరతకు దోహదం చేస్తాయి.

నీటి విషయంలో ముందు చూపు లేకపోతె ఆహార, ఆరోగ్య, ఇంధన భద్రతకు ప్రమాదం ఏర్పడగలదు. నీటి కోసం ఆందోళనలు, తగాదాలు ఏర్పడే అవకాశం ఉంది. వాతావరణ మార్పుల కారణంగా నీటి వనరుల పరిస్థితి ఎలా మారుతుందో తెలియదు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 3 బిలియన్లకు పైగా ప్రజలు  జాతీయ సరిహద్దులను దాటి ప్రవహించే లేదా పరచుకొని ఉన్న అంతర్జాతీయ  నీటి వనరులపై ఆధారపడి ఉన్నారు. ఈ అంశాన్ని  పరిగణనలోకి తీసుకుంటే, నీటి వనరుల యాజమాన్యం, హక్కుల కారణంగా ఎదురయ్యే పరిణామాలు చాలా గంభీరమైనవి మరియు సున్నితమైనవి.  ఆశ్చర్యకరంగా, నదులు, సరస్సులు మరియు జలాశయాలను పొరుగువారితో పంచుకుంటున్న 153 దేశాలలో, కేవలం 24 మాత్రమే నీటి వనరుల అన్ని భాగస్వామ్య కోసం సహకార ఒప్పందాలను ఏర్పరచుకున్నాయి.

వాతావరణ మార్పుల యొక్క తీవ్ర ప్రభావాలతో, ఈ అమూల్యమైన సహజ వనరును సంరక్షించడానికి ప్రపంచ దేశాలు దేశం లోపల, మరియు అంతర్జాతీయంగా కలిసి రావాల్సిన అవసరం ఏర్పడింది. ప్రపంచ జనాభా పెరుగుతున్న కొద్దీ, పేదరిక నిర్మూలనకు, పర్యావరణ సమతుల్యతకు జరిగే ప్రయత్నాలలో నీటి ప్రాముఖ్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. నీటి నిర్వహణలో సహకార ప్రయత్నాలు వాతావరణ మార్పుల విపరిణామాలను నిరోధించే సామర్థ్యాన్ని ఇస్తాయి మరియ మారుతున్న వాతావరణానికి అనుగుణంగా జీవించగలిగే వెసులుబాటును జనాభాకు కలుగజేస్తాయి.

ప్రజారోగ్యం, సమాజ శ్రేయస్సు, ఆహార ఉత్పత్తి మరియు శక్తి వ్యవస్థలు, ఆర్థిక ఉత్పాదకత మరియు పర్యావరణ సమగ్రత వంటి అంశాలలో నీటి వనరులు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అందరికీ మంచి నీరు, పారిశుధ్య వసతులు కల్పించి, వివక్ష చెరిపివేసి, సమానత్వానికి కల్పించడం ద్వార ద్వార ఒక సానుకూల వాతావరణాన్నిసృష్టించవచ్చు. నీటి వనరుల వినియోగంలో సహకార చర్యలు ఇతర అభివృద్ధి రంగాలను ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. నీటి యాజమాన్యంలో శాంతియుత సహకారాన్ని, సమిష్టి ప్రయత్నం ద్వారా, కనీస మానవ హక్కులు మరియు అవసరాలను తీర్చడంలో సుస్థిరమైన అభివృద్ధికి ఉత్ప్రేరకంగా నీటి వనరులు పని చేస్తాయి.

చిన్న చిన్న పనులు పెద్ద మార్పుకు నాంది పలుకుతాయి. ఈ జల దినోత్సవం సందర్భంగా అందరం నీటి సంరక్షణకు ప్రతిజ్ఞ పూనుదాం.

- ప్రతి ఇంటి చెంత ఉండాలి ఇంకుడు గుంత
- నీటి ట్యాంకుల నుండి, గొట్టాల నుండి నీరు వృధా కాకుండా అరికడదాం.
- ఇంటిలోని నల్లాలు, పైపులు, స్నానాల గదులు, అన్నీ లీకులు లేకుండా
- చూసుకుందాం.
- గడ్డం గీసుకునేటప్పుడు, ముఖం కడుక్కునేటప్పుడు, కూరగాయలు కడిగేటప్పుడు, ఇతర దైనందిన కార్యక్రమాలలో నల్లాని నిరంతరం తెరచిఉంచడాన్ని మానేద్దాం.
- స్ప్రింకర్లు, డ్రిప్లు వాడుకుందాం. తక్కువ నీటితో ఎక్కువ పంటను పండించుకుందాం.
- ఇంటి వద్ద, పొలాల వద్ద మొక్కలు నాటుదాం. నీటిని భూమిలోకి ఇంకించుకుందాం.
- ఇంటిపై పడ్డ వాన నీటిని ఒడిసి పడదాం. భూగర్భ జలాన్ని రక్షించుకుందాం.
- ఆహారాన్ని వృధా చేయడం తగ్గిద్దాం. నీటిని కాపాడుకుందాం.
- పొలాలలో నీటి గుంతలు, కందకాలు, ఇతర నేల మరియు నీటి సంరక్షణ చర్యలు చేపడదాం. భూగర్భ జలాన్ని పెంపొందిద్దాం.
- నీటి అక్షరాస్యతను పెంచుకుందాం. మన గ్రామాన్ని కరువు రహితంగా మార్చుకుందాం.
- నీటి కాలుష్యాన్ని తగ్గిద్దాం. స్వచ్ఛ భారతానికి బాటలు వేద్దాం.
- నీటిని పంచుకుందాం. మానవతను నిలుపుకుందాం.

# నీరు, ప్రగతి, ప్రపంచ శాంతి

ప్రపంచ జల దినోత్సవం

22 మార్చ్ 2024

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సి.జి.ఆర్) సంస్థ గత 14 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు, సుస్థిరాభివృద్ధి కొరకు కృషి చేస్తున్నది. సి.జి.ఆర్ నేటి వరకు 34,51,681 మొక్కలను 11,02,451 మంది పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నాటించడం జరిగింది. తూర్పుకనుమల పరిరక్షణ కోసం 3 ప్రాంతీయ, 2 జాతీయ సదస్సులను నిర్వహించి ఒక సమగ్ర నివేదికను రూపొందించింది. ఈ నివేదికను మాజీ రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. హైదరాబాద్‌కు చేరువలో అంతర్జాతీయ స్థాయి పర్యావరణ నాయకత్వ శిక్షణ, పరిశోధన కోసం 'ది ఎర్త్ సెంటర్' ప్రాంగణాన్ని నెలకొల్పింది.. తెలంగాణ ప్రభుత్వంచే 2016 మరియు 2017 సం.లలో హరిత మిత్ర పురస్కారాన్ని అందుకున్నది. 2016సం.లో క్యాపిటల్ ఫౌండేషన్ ఢిల్లీవారిచే జస్టిస్ కుల్దీప్ సింగ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నది. ప్రతి సంవత్సరం, పర్యవరణ దినోత్సవాలను జరుపుకుంటూ సమాజంలో విస్తృత చైతన్యానికి, బాధ్యతకు కృషి చేస్తున్నది. ఈ సందర్భంగా 2024 జల దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపునిస్తున్నది. ఈ దినోత్సవాన్ని ఇలా జరుపుకుందాం

- జల సంరక్షణకు ప్రతిజ్ఞ పూనుదాం
- ర్యాలీ నిర్వహిద్దాం.
- వ్యాస రచన, ప్రసంగ పోటీలు నిర్వహించుకుందాం.
- కళా, సాంస్కృతిక, చైతన్య కార్యక్రమాలను నిర్వహిద్దాం.
- నిర్మాణాత్మక సందేశాలు పంచుకుందాం
- అంతర్జాతీయ, జాతీయ, స్థానిక నీటి యాజమాన్య విధానాలపై చర్చ జరుపుదాం
- అవగాహనా సదస్సులు విధాన పరమైన సలహాలు, సూచనలు
- సామజిక మాధ్యమాల ద్వారా (ఇంస్టా గ్రామ్, లింక్డ్ ఇన్, ట్విట్టర్(X), పేస్ బుక్కు, యు ట్యూబ్ లలో విస్తుత్ర సమాచార వ్యాప్తి
- పత్రికా ప్రకటనలు, వ్యాసాలు పంపిద్దాం
- పత్రికా సమావేశాలు నిర్వహిద్దాం

****